జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి రు. 116 పొందిన కథ

# సన్యాసి లాకెట్లో లక్ష్మి

సరిగ్గా రాత్రి ఏడున్నర.

జనత తావి ఎక్స్‌ప్రెస్ ఒంగోలు ప్లాట్‌ఫాం నంబర్ వన్ పక్కన ఆగి ఉంది. చేయి పట్టుకు దారి చూపే పోర్టర్ వెనుక పడుతూ లేస్తూ పరుగు పెట్టున నడిచాడు ముకుందం. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో పోర్టర్ వెనుకనే చొరబడి అతను చూపిన ఓ మూల సీటులో కిటికీ పక్కనక్క కూర్చున్నాడు.

చక్రాలు కీచుమన్నాయి. సకల చరాచర వస్తు ప్రాణులతో స్టేషన్ ఆవరణంతా వెనక్కి నడిచింది.

ప్లాట్‌ఫాం వదిలింది జనత.

చుట్టూ కనిపించినంత మేర కలయ చూశాడు ముకుందం. జీవిత కావ్యానికి సంక్షిప్త నిర్వచనంలా ఉంది కంపార్ట్‌మెంట్. అతని పక్కన కూర్చున్న వృద్ధ దంపతులు తిరుగు ప్రయాణంలో తిరుపతిని గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ పక్కన భూస్వాములు కౌలు యాక్ట్ లొసుగుల గురించి వాదించుకుంటున్నారు.

ముకుందాన్నే చూస్తూ కూర్చుంది ఎదురు సీటులో ఒకామె. ఆమె పక్కన జంటలో భర్త భుజాలకు తల ఆనించి నిద్రపోతోంది భార్య. చెరొక ఇంగ్లీషు సెక్స్ థ్రిల్లర్లో లీనమయి ఉన్నారు బెంచి చివర ఇద్దరు స్టూడెంట్స్. సీట్ల మధ్య సందులో పరిచిన దుప్పటిమీద గాఢ నిద్రలో ఉన్నారు రేపటి పౌరులు.

నార్త్ కేబిన్ దాటి వేగం పుంజుకుంటుంది జనత. గుండెలమీద చేయి వేసుకుని గట్టిగా ఊపిరి పీల్చాడు ముకుందం.

ఎడాపెడా తుఫాను గాలి. దారి తప్పి కాలువగట్టున పడిచి పోతున్న బాటసారి ఏం చేస్తాడు?.... ఈదురుగాలికి దొర్లి కాలువలో పడకుండ మోకాళ్ళను





చేతులతో చుట్టి, వాటి మీద తల ఆనించి బిగుసుకు కూర్చుంటాడు. ఈ తుఫాను తగ్గేదెప్పుడా? అని ఎదురు చూస్తాడు.

అంత వరకు అలా హోరెత్తించిన తుఫాను ఆగింది. అప్పుడేం చేస్తాడా బాటసారి? లేచి నిలబడి ఒళ్ళు విరుచుకుంటాడు. కళ్ళు తెరిచి తెరిపిగా ప్రపంచాన్ని చూస్తాడు. బతుకు జీవుడా అని తిరిగి నడక ప్రారంభిస్తాడు.

సీటులో సర్దుకు కూర్చుంటూ ఆ నిముషాన అలా రిలీఫ్ ఫీలయ్యాడు ముకుందం.

తన వంకే సూటిగా చూస్తున్న ఎదురు సీటులో ఆమె చూపులకు తట్టుకోలేక తలవంచుకున్నాడు ముకుందం.

"ఎంత వరకు మీరు?" అడిగింది ఆమె.

తనని కాదన్నట్లుగా అటూ ఇటూ చూశాడు ముకుందం.

"మిమ్మల్నే" తిరిగి అంది ఆమె.

కిటికీ గుండా బయటికి చూశాడు. తరువాత కంపార్ట్‌మెంట్ పైకప్పు వైపు చూశాడు. తిరిగి ఆకాశంలో చంద్రుని పరికించాడు. చివరికి తనలో తను గొణుకున్నట్లుగా చెప్పాడు ముకుందం.

"ఋషీకేశ్"

"అక్కడ వర్క్ చేస్తున్నారా?"

అడ్డంగా తల ఆడించాడు ముకుందం.

పైకి అనలేదు ముఖంలో ఆశ్చర్యం దాచుకోలేకపోయింది ఆమె.

మూడు పదులలోపు వయసు. కట్టుబట్టలతో ఒంటరిగా బయలుదేరాడు. పోనీ టూరిస్టేమో అనుకుంటే వెంట ఉండవలసిన లగేజి ఏమి పక్కన లేదు.

పత్రిక తెరచి ఆమె చూపులైతే మరల్చింది కాని ముకుందం నుంచి మనసును మాత్రం మరల్చలేకపోయింది.

'సంసార బంధాలమీద రోసిన వానిలా బయలుదేరాడు. అందునా సన్యాసాన్ని వృత్తిగా మార్చి సకల సౌకర్యాలతో ప్రజలమధ్య వెలిగే ఈ.


## రచయిత పరిచయం

కథలు వ్రాయటం సరదా. కేవలం కాలక్షేపమే కాక కథ ప్రయోజనకారి కూడ కావాలని అభిలాష. ఇక బహుమతి అంటారా, ఇది ఒక తీయటి అనుభవం.

కథ గుర్తుంటే, రచయిత గుర్తున్నట్టే. అది లేకుంటె నేనిక్కడ ఏమిచ్చినా ఓకే.

ఈ అవకాశాన్నిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

బి. మధుసూదనరావు




రోజుల్లో అంత దూరం వెళ్ళేదెవరు? చూస్తే ఉట్టి అమాయకుడిలా ఉన్నాడు' అని ఆలోచిస్తుంది ఆమె.

నిజంగా ఉట్టి అమాయకుడు, బహు నెమ్మదస్తుడు ముకుందం.

చిరాకు కలిగినప్పుడైనా కొమ్ము విసురుతుంది గోవు. ఎదుటి మనిషి దురుసుగా మాట్లాడుతున్నప్పుడు కూడ ఎలాటి అసహనాన్ని ప్రదర్శించడు. ఎవరైనా ఏదైనా ప్రశ్నించినప్పుడు కూడా నోరు విప్పి బదులు చెప్పడు. అవును, కాదు అనేది పీ్కైనంత వరకు నెమ్మదిగా తల ఆడించో, సంజ్ఞల ద్వారానో తెలియచేస్తాడు.

దానికి తోడు అలాటివాడు ఇలాటి వాడు అయితే ఈ ఆర్థిక వ్యవస్థలో నోట మన్ను కరుచుకునే వాడే ముకుందం.

ఉన్న ఊళ్ళో ఎకౌంట్స్ లెక్చరర్‌గా వచ్చే జీతం కాక పైన ట్యూషన్స్. ఊరి సెంటర్‌లో షాప్స్ నుంచి లీజ్‌కు తీసుకున్న నేష్నలైజ్‌డ్ బాంక్ నుంచి అద్దె తెచ్చిపెట్టే బిల్డింగ్ కాంప్లెక్స్. ఇవికాక పన్నెండెకరాల పత్తి పండే భూమి, భార్య తరపున ఏడెకరాల జీడిమామిడి తోట-ఉండబట్టే-దినం దినం వెతుక్కునే ఇబ్బందులు లేకుండా ఆర్థికంగా సజావుగా ఉంది అతని జీవితం.

సీటు కింద వేలాడ వేసిన రెండు కాళ్ళ సందున చేతులు బిగించి తల వంచుకు కూర్చున్నాడు ముకుందం.

"మారీడా మీరు?" మెల్లగా అడిగింది ఆమె.

తల ఊపాడు ముకుందం అవునని.

"ఎంత కాలం అయింది?"

మూడు వేళ్ళు చూపాడు,

"జీవితం మీద విరక్తా"

లేదన్నట్లు తల ఆడించాడు.

"భార్య డీసీవ్ చేసిందా?"

"కాదు"

"మరి....ఇంకేమిటి?"

ఏమని చెప్పేట్లు? చెపితే వెక్కిరిస్తుందేమో! భయపడ్డాడు ముకుందం.

కానీ తన కష్టాన్ని అంత వరకు అలా పరామర్శించిన వాళ్ళు లేరనిపించింది. ఊరడిస్తే తలపుకు వచ్చినట్లు దుఃఖం పొంగుకు వచ్చింది.

తల పక్కకు తిప్పి కిటికీగుండా బయటకు చూశాడు.

రైల్వే ట్రాక్ పక్కల వరకు తన్నుకు వస్తూంది ఎక్కడిదో వరద నీరు. ఎటు చూసినా జలరాశి. నీటిలో మునిగే మనిషి పైకెత్తిన చేతుల్లా వరి మొక్కల కొసలు ఏటిపైన కొన ఊపిరితో ఊగిసలాడుతున్నాయి.

చూడమన్నట్లు వేలు చూపించాడు ముకుందం.

చూసింది ఆమె. కట్టలుతెగి ప్రవహిస్తూంది నీరు.

'ఏమిటి?' అన్నట్లు చూసిందామె.

"సో వైల్డ్"

"ఏమిటేమిటి?"

"ఆమె నోరు"

అని ఆమె వైపు చూశాడు.

ముకుందం భయపడినంత అయింది. ఓ చేయి పొట్టమీద తొక్కి పట్టింది. మరో చేత్తో హాండ్ కర్చీఫ్ నోటికి అదిమి పట్టింది.

"అందుకు" నవ్వు దొంతర్ల మధ్య అడిగింది ఆమె "పెళ్ళాన్ని వదిలి పారిపోతున్నారా?"

సైకిల్‌మీద నుంచి పడి ఒళ్ళంతా దోక్కుపోయి తను బాధ పడుతుంటే తన స్టూడెంటొకడు అది చూసి నవ్వినట్లు అనిపించింది. పడిన పుండును చూసుకుంటుంటే దారిన వెళ్ళే గరల్ స్టూడెంట్ కొక్కిరించినట్లు అనిపించింది. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు ముకుందం.

ఎనిమీ మిషన్‌గన్ బులెట్స్ తూట్లు చేస్తుంటే సిపాయి శరీరం ఎంత గట్టిదైనా ఏమౌగుతుంది? చిన్నా భిన్నమవుతుంది. మెలికలు తిరుగుతూ ఎగిరెగిరి పడుతుంది. భార్య వాక్ ప్రవాహానికి అలా విలవిల్లాడేది ముకుందం మనసు. ఎప్పుడో ఓ సారి అయితేనో లేదా ఫలానా షెడ్యూల్ అనుసరించో అయితే ముందుగా ఊహించి ఆ ప్రకారం ఏ ట్రెంచెస్ లోనో తల దాచుకోవచ్చు. కాని గొరిల్లా వార్‌ఫేర్‌లా అతను చేసిన ఏదో ఒక పనికి వంక పెట్టటం హఠాత్తుగా గన్ గురిపెట్టటాన్ని మూడు దీర్ఘ సంవత్సరాలు సహించి, భరించి చివరికి ఆ నాటికి ఓ నిర్ణయానికి రాగలిగాడు ముకుందం.

తల ఎత్తి చూశాడు ముకుందం.


ఎదురుగా కూర్చున్న ఆమె అప్పటికీ నవ్వు ఆపుకోలేక తిప్పలు పడుతుంది. చూడలేక లేచి డైనింగ్‌కార్ వైపు దారి తీశాడు.

బడబాగ్నిలో చిక్కి ఎలాగో వెనుక ఓ సారి చావు తప్పుకున్న లేడిపిల్ల ఆ తరువాత నిప్పు చూస్తే? వెనుక నుంచి భార్య మాటల్లా వినిపించి అంత బెదిరిపోయాడు ముకుందం.

నోట్లో పెట్టుకోబోయే ముద్ద ఆగింది. కుర్చీకింద టైమ్ బాంబ్ చూసినట్లయింది. వెనక్కు చూశాడు.

కాని ఆ మాట్లాడుతుంది ఎవరో. భోజనం అయిందనిపించి లేచి చేయి






కడిగి వెనక్కు బయలుదేరాడు ముకుందం.

కంపార్ట్‌మెంట్ అంతా కిక్కిరిసి ఉంది. సీటు అంచులు పట్టుకుని కొందరు, పై బర్త్ చివరలు పట్టుకుని కొందరు కునుకు తీస్తున్నారు. కలత నిద్రలో కాళ్ళు జాపబోయి సీటు చాలక జారిపడి తిరిగి సర్దుకుకూర్చుంటున్నారు కొందరు. రైలు కదలికకు ఊయల్లో పాపల్లా జోగుతున్నారు.

చూసినా ఇవేమీ పట్టించుకునే స్థితిలో లేడు ముకుందం. ఈ దృశ్యాలన్నీ కలల్లో చిత్రాల్లా కనిపించి కదిలిపోతున్నాయి. నిద్రలో నడిచే జబ్బున్న మనిషిలా నడిచి పోతున్నాడు.

దారిలో వాళ్ళను తప్పుకుంటూ వచ్చి తన సీటులో కూర్చున్నాడు ముకుందం. చేతులు కట్టుకుని కళ్ళు మూసుకుని సీటు మూలకు ఆనుకుని ఉంది ఎదురు సీటులో ఆమె. ఉండి ఉండి చిరుహాసం ఒకటి ఆమె పెదవుల మీద నాట్యం చేస్తూనే ఉంది.

తిరిగి కళ్ళు మూశాడు ముకుందం.

మూసిన కళ్ళల్లో మరీ వికృతంగా కనిపించింది అతనికి భార్య. జానపదాల్లో భూతంలా పెరిగి-పెరిగి ఆమె భూమ్యాకాశాలు నిండింది. చేతులు చాపి తన మీదకు వస్తున్నట్లు భయపడి కళ్ళు తెరిచాడు ముకుందం.

"డైవర్సుకు ఎందుకు ట్రై చేయలేదు?" అడిగింది ఆమె.

మాట్లాడలేదు ముకుందం. ఆమెకు సమాధానం చెప్పలేదు. అలాగే చూస్తూండి పోయాడు. కాని ఎదురుగా

వుండేదేదీ ఒతని కళ్ళకు కనపడటం లేదు.

తెనాలి స్టేషనులో ఆగింది జనత. కంపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు దిగారు. ఆరుగురు ప్యాసింజర్స్ ఎక్కారు. ఎక్కిన వాళ్ళు బోగీలోకి తొంగి చూసి లోపలకు వచ్చే మార్గం లేక అక్కడే టాయిలెట్ పక్క తలుపుకు ఆనుకుని క్రింద కూర్చున్నారు.

స్టేషన్ వదిలింది జనత.

ఎదురుగా కూర్చున్న ఆమె కిటికి లోంచి బయటి వెన్నెలను చూస్తోంది. ఆమె ముఖంలో అంతకు ముందటి నవ్వు మాయమయింది.

దీర్ఘంగా ఆలోచించి ఆమె. మకుం దాన్ని జాలిగా చూసింది.

కిటికీలో చేయి ఆనించి దాని మీద తల వాల్చి శూన్యంలోకి చూస్తున్నాడు ముకుంద.

ముకుందంలానే కిటికీలో తల వాల్చి-

"వెన్నెల.... ఎంత తెల్లగా వుందో!" అంది ఆమె.

"ఊ..." అన్నాడు ముకుందం.

"ఎంత చల్లగా కూడ వుందో?"

"........"

"పక్కన కాలువలో చూడండి.... కలువ పూలు ఎలా వికసించాయో"

"........"

"ఇదంతా సృష్టికర్త గీసిన ప్రకృతి చిత్రంలా సౌందర్యంతో తొణికిసలాడటం లేదూ?"

"ఊ...."

"కాని చూశారా?..అందాల చంద్రునిలో ఆ మచ్చ!"

బేలగా ఆమె ముఖంలోకి చూశాడు ముకుందం. చీకటిలో తవుడుకుంటున్న తనని చేయి పట్టి నడిపిస్తున్నట్లు అనిపించింది. దారి తెలియక తికమక పడుతున్న వానికి "అదిగో, అటు" అని ఆమె దారి చూపే ప్రయత్నంలో వున్నట్లు అనిపించింది.

"ఆ మచ్చ కూడ లేకుంటే వంక లేని సౌందర్యమే అవుతుంది"

తల దించాడు ముకుందం.

"కాని.... వేళకు భోజనం పెడుతుందా మీ మిసెస్?"

"ఊ...."

అంతే కాదు దగ్గర కూర్చుని కొసరి కొసరి తినిపిస్తుంది.

"మీరెప్పుడైనా ఏదైనా వ్యవహారంలో చిక్కుకుంటె చూస్తూ ఊరుకుంటుందా?"

"ఉహుఁ...."

అలాంటి సమయాల్లో ముందుకు వచ్చి సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తుంది.

"మీరెప్పుడైనా జబ్బు పడినప్పుడు?"

ఎంతో బెంబేలు పడుతుంది. నిద్రాహారాలు మాని దగ్గర కూర్చుని "కంటికి రెప్పలా కాపాడుతుంది"

"బెడ్ పార్టనర్‌గా?...."

"ఏ లోపం లేదు"

ఆమె సమక్షంలో ఆ కాలం ఇట్టే గడిచిపోతుంది.





ముకుందం మనసులో సూర్యోదయం ముందులా ఓ వెలుగురేఖ పొడచూపింది. క్రమేపి అది పెరిగి పూర్ణ సూర్య బింబం ఆకాశంలో తళతళా నిలచేసరికి చుట్టూ వెలుగు పరుచుకున్నట్లు అయింది.

"చంద్రుని చూసినప్పుడల్లా నాకిదే గుర్తుకు వస్తుంది... మీ దృష్టి అంతా మీ భార్యలో ఒక్క లోపం మీదే ఉంది కాని.... మీ కిష్టమైనవి, మీ మనుగడకు ఆధారమైనవి ఇన్ని ఉన్నాయని ఒక్కసారైనా ఆలోచించారా?"

[illegible]ర తొలగించినట్లు అనిపించింది ము[illegible]దానికి. అంతవరకు భూతంలా కని[illegible]న భార్య రూపం క్రమేణా ఫే[illegible] అయి శాపవిమోచన పొందిన గంధర్వకన్యలా కళ్ళ ముందు నిలచినట్లయింది. అంతవరకు జుగుప్స కలిగించిన మెడలో ఎముకల గొలుసు పూలదండలా, నుదుటిమీది వికృతమైన మూడో కన్ను కస్తూరి తిలకంలా, ఒళ్ళంతా అలుముకున్న రోమం దేవతా వస్త్రాల్లా మారాయి. తనను కబళించటానికి అన్నట్లుగా చాపిన చేతులు కౌగిలి కోసం ఆరాటపడే ప్రియ హస్తాల్లా మారాయి.

విజయవాడ స్టేషనులో జనత ఆగి కొద్ది నిముషాలయింది. దిగే వాళ్ళను ఎక్కే జనం దిగనివ్వటంలేదు. విజిల్ వేసి లైట్ చూపాడు గార్డ్. కూత వినిపించింది.

లేచి నిలబడ్డాడు ముకుందం.

"బండి కదులుతుంది మాష్టారూ... త్వరగా దిగండి"

చక్రాలు కదిలాయి.

జనాన్ని తప్పుకువెళ్ళి దిగే టైమ్ లేదు. కిటికిలో దూరాడు ముకుందం. గట్టిగా పట్టుకుంది ఆమె. ఎలాగో వచ్చి విజయవాడ ప్లాట్‌ఫాం మీద చతికిలపడ్డాడు ముకుందం.

'నచ్చనిదొకటి ఎంత పని చేసింది!' గట్టిగా ఊపిరి పీల్చింది ఆమె.

ఒంటికి పట్టిన దుమ్ము దులుపుకుంటూ అటు చూశాడు ముకుందం. వెళ్తున్న ట్రయిన్ నుంచి టాటా చెపుతుంది ఆమె.

జారిన చెప్పు తొడుక్కున్నాడు ముకుందం. జుట్టు సరిచేసుకున్నాడు. లేచి నిలబడ్డాడు.

అంతరిక్షంలో దూసుకుపోతోంది రాకెట్. మధ్యలో ట్రబులిచ్చింది.... అటు ఊగింది ఇటు పరుగెత్తింది. పరిస్థితి చూశాడు వ్యోమగామి. ఈ అనంత విశ్వంలో ఎక్కడో తను. జీవితంమీద ఆశ వదిలి సృష్టికర్తను తలుచుకున్నాడు.

అయితే-రాకెట్ వచ్చి నేరుగా పసిఫిక్ మహాసముద్రంలో పడింది. రెస్క్యూచేసి అభినందిస్తున్న వాళ్ళ మధ్య కళ్ళు తెరిచి చుట్టూ చూసిన అతనికి ఎలా ఉంటుంది?

ఒంగోలు వెళ్ళే ట్రయిన్ వివరాల కోసం ఎంక్వయిరీ దగ్గరకు హుషారుగా వెళ్ళాడు ముకుందం. ❊